కెరమెరి : గిరిజనులకు దుప్పట్లు అందజేస్తున్న ఎఫ్ఆర్‌వో మజారొద్దీన్

దుప్పట్ల పంపిణీ

కెరమెరి, జనవరి 12: మండలంలోని చింతకుంట గ్రామంలో ఎఫ్ఆర్‌వో మజారొద్దీన్ ఆధ్వర్యంలో పంచముఖ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని గ్రామంలోని 100 మంది గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అడవి, వన్యప్రాణులను కాపాడే బాధ్యత అందరిపై ఉందని గ్రామస్తులంతా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కృష్ణ చైతన్య, సభ్యులు నరసింహ శాస్త్రి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

17న గంగాపూర్ జాతర వేలం పాట

రెబ్బెన, జనవరి 12: మండలంలో గంగాపూర్ గ్రామశివారులో కొలువైన గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి జాతర ఫిబ్రవరిలో జరుగనున్న నేపథ్యంలో ఈ నెల 17న మధ్యాహ్నం 12గంటలకు జాతర వేలంపాట నిర్వహిస్తామని ఆలయ ఈవో బాపిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొబ్బరికాయలు, పూజ సామగ్రి, ప్రసాదం, తైబజార్ ప్లాట్లు, వాహనాల పార్కింగ్ ల వేలం పాట కోసం పాల్గొనే వారు 20వేల రూపాయలు డిపాజిట్ రూపంలో చెల్లించాలని సూచించారు.

పాము కాటుకు బాలిక మృతి

వాంకిడి: బావునే కల్పన (ఫైల్)

వాంకిడి, జనవరి12 : పాము కాటుకు ఓ బాలిక మృతి చెందిన ఘటన వాంకిడి మండల కేంద్రంలోని మజ్జిద్‌వాడలో శుక్రవారం సాయంత్రం 3 గంటలకు జరిగింది. ఎస్ఐ సాగర్ తెలిపిన ప్రకారం.. మండలంలోని మజ్జిద్ వాడకు చెందిన బావునే కల్పన(10) 4వ తరగతి విద్యార్థిని ఇంట్లో మంచంపై పడు కొని సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతుండగా ఎడమ కాలుకు పాము కాటు వేసింది. బాలిక గట్టిగా ఏడుస్తూ కేకలు పెట్టడంతో కుటుంబసభ్యులు గమనించి వెంటనే వైద్యం కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. అల్లారుముద్దుగా పెంచు కున్న కూతురి మృతితో బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలిక తండ్రి బావునే విలాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హరితహారానికి సిద్ధం

- 28 జీపీల్లో నర్సరీల నిర్వహణ
- కొనసాగుతున్న బ్యాగు ఫిల్లింగ్ పనులు
- జూన్ నాటికి 3లక్షల 50వేల మొక్కలు అందించడమే లక్ష్యం

వాంకిడి: గణేశ్‌పూర్ నర్సరీలో మట్టితో నింపిన సంచులు

వాంకిడి, జనవరి12 : పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనానికి ప్రాధాన్యమిస్తూ గత ప్రభుత్వం ప్రతియోటా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వచ్చింది. ఇందులో భాగంగా ఇప్పుడు కూడా మొక్కల పెంపకానికి ప్రాధాన్యమిస్తున్నారు. ప్రతి ఏటా నర్సరీలో మొక్కలను పెంచి వర్షాకాలంలో విరివిగా నాటుతూ సంరక్షిస్తున్నారు. ఇప్పటి నుంచే పదో విడత హరితహారం కోసం మండలంలో నర్సరీల్లో మొక్కలను పెంచేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మొక్కల పెంపకం వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వాంకిడి మండలంలోని 28గ్రామపంచాయతీల్లో నర్సరీల నిర్వహణ పనులు వేగవంతంగా చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా 3లక్షల50వేల మొక్కల పెంపకమే లక్ష్యంగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

● ప్రతి నర్సరీలో 10 వేల మొక్కలు

ప్రతి గ్రామపంచాయతీలోని నర్సరీలో 10 వేల మొక్కలు పెంచే విధంగా నర్సరీలు సిద్ధం చేస్తున్నారు. నర్సరీకి ఇప్పటికే మొక్కలను పెంచేందుకు ప్లాస్టిక్ బ్యాగులను సైతం సరఫరా చేశారు. ఈ బ్యాగుల్లో ఒంద్రు, నల్లమట్టి, ఎర్రమట్టి, పశువుల ఎరువును కలిపి బ్యాగ్ ఫిల్లింగ్ పనులు ప్రారంభించారు. నర్సరీల్లో టేకు, ఉసిరి, జామ, సీతాఫలంతో పాటు వేప, మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.

● ఉపాధి పొందుతున్న కూలీలు

హరితహారం కార్యక్రమం కోసం నర్సరీలో చేపడుతున్న మొక్కల పెంపకంతో ఉపాధి హామీ పథకంలో భాగంగా పలువురు కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఒకొక్క నర్సరీలో బ్యాగు ఫిల్లింగ్ కోసం 15నుంచి 20మంది కూలీలు పనిచేస్తుండడంతో వారికి ప్రతిరోజూ రూ.265వరకు ఉపాధిహామీలో భాగంగా కూలీ చెల్లిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు అంతగా లేకపోవడంతో నర్సరీల్లో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు.

బ్యాగ్ ఫిల్లింగ్ పనులు చేపడుతున్నాం

మండల వ్యాప్తంగా హరితహారంలో మొక్కల పెంపకానికి 28 గ్రామపంచాయతీల్లో నర్సరీ నిర్వహిస్తున్నాం. ఈ నర్సరీల్లో ఇప్పటికే మొక్కల పెంపకం పనులు ప్రారంభమయ్యాయి. మొక్కల పెంపకానికి మట్టిని తెప్పించి ప్లాస్టిక్ సంచుల్లో నింపే పనులు చేపడుతున్నాం. జూన్‌లో మొక్కలు అందించేందుకు పనులు వేగవంతం చేయిస్తున్నాం.

—శ్రావణ్ కుమార్,ఏపీవో,వాంకిడి

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి

రెబ్బెన : గోలేటిలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

రెబ్బెన, జనవరి 12: మండలంలో ప్రజాపాలనలో 11,156 దరఖాస్తులు రాగా వాటికి సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ శుక్రవారం పూర్తి చేసినట్లు రెబ్బెన ఎంపీడీవో పరికిపండ్ల శ్రీనివాస్ తెలిపారు. 20 మంది ఆపరేటర్లను ఏర్పాటు చేసి రాత్రి, పగలు అందరి సహకారంతో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. రేషన్‌కార్డులు, భూ సమస్యల కోసం వచ్చిన దరఖాస్తులు కూడా ఆన్‌లైన్ చేయాలని పై అధికారుల నుంచి ఆదేశాలు వస్తే వాటిని కూడా ఆన్‌లైన్ చేయడానికి అందరూ సంసిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ నమోదు చేయడానికి సమయం ఉన్నప్పటికీ కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అందరూ సహకరించడంతో గడువు కంటే ముందే పూర్తి చేసారని వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నటు ఎంపీడీవో స్పష్టం చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి 3 ఏండ్ల జైలు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 12: హత్యాయత్నం కేసులో నిందితుడికి 3 ఏండ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్ కోర్టు జడ్జి యువరాజ్ తీర్పునిచ్చారు. కాగజ్‌నగర్ లైసనింగ్ అధికారి బాబాజీ తెలిపిన ప్రకారం.. 2021లో హత్య చేయడానికి ప్రయత్నించిన బెజ్జూర్ మండలం ఇప్పలగూడ గ్రామానికి చెందిన తొగరం పరదేశిపై అప్పటి ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. శుక్రవారం ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసాద్ ప్రవేశపెట్టిన సాక్షులను విచారించి నిందితుడికి ఐపీసీ సెక్షన్ 307 కింద 3 ఏండ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించారు.

క్యాంప్ సేవలను సద్వినియోగించుకోవాలి

రెబ్బెన, జనవరి 12 : రౌటసంకెపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో నివాసం ఉంటున్న కొలాం కులస్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్‌కార్డ్ ఎన్‌రోల్‌మెంట్, అప్‌డేట్ స్పెషల్ క్యాంప్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని రెబ్బెన మీ సేవ నిర్వాహకుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. రౌటసంకెపల్లిలో మరో రెండు రోజులు క్యాంప్ కొనసాగుతుం దని ఆధార్‌కార్డు లేని ప్రతి ఒక్కరూ వచ్చి దిగాలని, దానితో పాటు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా ఈ స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

గ్రంథాలయ మాజీ చైర్మన్‌కు సన్మానం

గ్రంథాలయ మాజీ చైర్మన్ కనక యాదవ్ రావ్‌ను సన్మానిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 12 : జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ భవనంలో ఆ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావ్‌ను సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ని రోజులు గ్రంథాలయ చైర్మన్‌గా ఉన్న తనకు సహకరించిన ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, ఇతర ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులకు ధన్య వాదాలు తెలిపారు.ఇక్కడ గ్రంథాలయ కార్యదర్శి మునిశ్వర్, లైబ్రేరియన్‌లు రమణ, సతీదేవి, సలీం తదితరులు ఉన్నారు.

ఆదివాసీ ఉద్యోగ సంక్షేమ పరిషత్ జిల్లా కమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 12 : జిల్లా కేంద్రంలోని టీటీడీ బ్ల్యూఆర్‌జేసీ పాఠశాలలో శుక్రవారం ఆదివాసీ ఉద్యోగ సంక్షేమ పరిషత్ జిల్లా కమిటీని ఆ కమిటీ రాష్ట్ర నాయకుడు నీలకంఠ్, జాయింట్ సెక్రటరీ సురేశ్‌ల సమక్షంలో ఎన్నుకున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మవి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఆత్రం నరేశ్, ప్రధాన కార్యదర్శిగా మడావి మాన్కు, గౌరవ అధ్యక్షుడిగా బీర్‌షావ్, ఉపాధ్యక్షుడిగా జుగాదిరావు, ఆత్రం సురేశ్, జి.జుగాదిరావు, కావేశ్వరా రవు , జాయింట్ సెక్రటరీగా చరణ్, దేవ్‌రావు, భారవి బాయి, కోషాధికారిగా శ్రీనివాస్, మీడియా సెక్రటరీగా మడావి బాబు, సభ్యులుగా తులసి రామ్, శోభన్, గంగమని, భరత్, నాగోరావు, విద్మన్‌రావును ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఘనంగా జిజియా బాయి, వివేకానంద జయంతి

- విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, ప్రజాప్రతినిధులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్ : నివాళులర్పిస్తున్న ఆరె సంక్షేమ సంఘం నాయకులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 12 : జిల్లా కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో శుక్రవారం శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ మాతృమూర్తి రాజమాత జిజియా బాయి జయంతిని ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం జిజియా బాయి చిత్రప టానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లా డుతూ, రాజమాత జిజియా బాయి ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు చిన్నప్పటి నుంచి దేశభక్తి పెంపొందించి ధర్మాన్ని రక్షించాలని స్ఫూర్తి నిచ్చిం దని కొనియాడారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ డివిజన్ గౌరవ అధ్యక్షుడు దరి గోపాల్,అధ్యక్షుడు బోర్కుటే తిరుపతి, ఉపాధ్యక్షుడు బొట్టుపల్లి అన్నారావ్, ప్రధాన కార్యదర్శి నాగపూర్ మారుతి, కోశాధికారి ఎలుములే దిలీప్, సలహాదారు కోలే శంకర్, ప్రచార కార్యదర్శి కురాట్కార్ రమే శ్, ప్రచార కార్యదర్శి బొట్టుపల్లి ప్రశాంత్, ఆసిఫాబాద్ మండలాధ్యక్షుడు గేడేకార్ సంతోష్, ప్రధాన కార్యదర్శి దానపెల్లి శ్యామ్‌రావు, వ్యాపారవెత్త లోఖండే దాదాజి, మోతుగూడ సర్పంచ్ ఇరదండి వినోద్, వాంకిడి మండల కోశాధికారి నౌగడే రమేశ్, బురుగుడా అధ్యక్షుడు బుజడి వెంకన్న, మోతుగుడా అధ్యక్షుడు పిప్రే రాజన్న, ప్రచార కార్యదర్శి పిప్రే మహేశ్, బెల్గాం అధ్యక్షుడు కోలే బిజ్జు, గుండి అధ్యక్షుడు జబరి రాజు, అప్పాపెల్లి అధ్యక్షుడు బుడే శ్రీకాంత్,చిలాటిగుడా అధ్యక్షుడు పాలే పెంటు,గోవిందపూర్ గౌరవ అధ్యక్షుడు పిప్రే మారుతి, తుంపల్లి అధ్యక్షుడు సాంగ్డే కిషన్,ఆసిఫాబాద్ ప్రధాన కార్యదర్శి నాగపూర్ మనోహర్,కోశాధికారి కొఠారి కమలాకర్, సంఘ నాయకులు కోలే బాలాజీ, బొట్టుపల్లి ధర్మయ్య,పిప్రే దాము, బావుజి, శంకర్,భీమనకర్ అంతు,మురళి, మండోకార్ మల్లయ్య, లోనరే నాందేవ్ పాల్గొన్నారు.

● దుప్పట్లు పంపిణీ

స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలను వివేకానంద సేవాసమితి ఆధ్యర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద విగ్రహం వద్ద సేవాసమితి సభ్యులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్య క్షుడు బొనగిరి సతీశ్‌బాబు, సభ్యులు బండి శ్రీనివాస్ కృష్ణమాచార్యులు, చరణ్ సింగ్, రవీందర్‌రెడ్డి, కోటేశ్వరరావు, వేణుగోపాల్, మధుకర్, శ్రీనివాస్, వెంకన్న, శ్రీనివాస్, వినేష్, మధునయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంధం శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్ : దుప్పట్లు పంపిణీ చేస్తున్న వివేకానంద సేవాసమితి సభ్యులు

● సిర్పూర్(టీ) మండలంలో..

సిర్పూర్(టీ), జనవరి 12: చత్రపతి శివాజీ మాతృమూర్తి వీరవనిత జిజియా బాయి జయంతిని ఆరే కుల సంఘం నాయకులు శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్ చౌరస్తాలో జిజియా బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ సు హేల్ అహ్మద్, ఉప సర్పంచ్ తోట మహేశ్, సంఘం మండలాధ్యక్షుడు శంకర్, నాయకులు శంకర్, మోహన్, కిషోర్, మధుకర్ పాల్గొన్నారు.

● కౌటాల మండలంలో..

కౌటాల, జనవరి 12 : ఛత్రపతి శివాజీ మహారాజ్ తల్లి మాతృమూర్తి జిజియా బాయి, వివేకానంద జయంతిలను శుక్రవారం మండల కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘు భవనంలో సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిజియా బాయి మొదటి గురువుగా పేరొందడం, యువత ఉన్నత స్థానాలకు చేరాలని, యువతను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎనలేని కృషి చేసిన వివేకానంద స్వామిల గురించి పలువురు తెలియజేశారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వాను పటేల్, సంఘం మండలాధ్యక్షుడు వసంత్‌రావు, కోశాధికారి ఎల్ములే దత్తు, సభ్య లు మధుకర్, సునీల్, ప్రకాశ్, బూర్ల రవి, బిక్కాజీ, సోందాస్, తిరుపతి, నానాజీ, మిథున్ కవి రాజ్, భీమన్న, శంకర్ ఉన్నారు.

● చింతలమానేపల్లి మండలంలో..

చింతలమానేపల్లి, జనవరి 12: మండల కేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ మాతృమూర్తి వీరవనిత జిజియా బాయి జయంతిని ఆరె కుల సంఘం ఆధర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానాయ్య, ఆరెకుల సంఘం మండలాధ్యక్షుడు టోంబ్రే శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి డుబ్బుల వెంకయ్య, గ్రామ అధ్యక్షుడు చౌదరి రాజన్న, ఆరెకుల సంఘం నాయకులు కొంపరి సాయికిరణ్, లాట్కరి శంకర్, చౌదరి హరి, చౌదరి చంద్రశేఖర్, పుంజారి శ్రీమన్నారాయణ, చాప్లే సత్తయ్య, టోంబ్రే సురేశ్, కొంపరి గురువులు, చౌదరి సంజీవ్, చౌదరి ప్రశాంత్, చాప్లే అంజన్న, దంద్రే పోషన్న, పంజారి సతీశ్, నికాడి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టీ)లో..

కౌటాలలో..

చింతలమానేపల్లిలో..

వెదురు వస్తువులతో పర్యావరణానికి రక్షణ

దహెగాం: శిక్షణ శిబిరంలో పాల్గొన్న అధ్యక్షుడు కనకయ్య

దహెగాం,జనవరి12: సహజ సిద్ధంగా లభించే వెదురుతో తయారు చేసిన వస్తువులు పర్యావరణ పరిరక్షణకు మేలు చేస్తాయని మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు కనకయ్య అన్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మేదరి కులస్తులకు ఏర్పాటు చేసిన మేధాని శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శిక్షణ కేంద్రాన్ని మేదరి కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వెదురు బొంగులతో తయారు చేసిన వస్తువులను ప్రజలు ఆదరించి మేదరికులస్థుల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాపాల శ్రీనివాస్, కోశాధికారి దీకొండ సత్తయ్య, నాయకులు పోశయ్య పాల్గొన్నారు.

దిగబడ్డ లారీ.. నిలిచిన రాకపోకలు

వెంకట్రావ్‌పేట్‌లోని ప్రధాన రహదారిపై దిగబడిన లారీ

సిర్పూర్(టీ), జనవరి 12 : మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఓ భారీ లారీ గుంతలో దిగబడిపోయింది. దీంతో వెంకట్రావ్‌పేట్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మహరాష్ట్ర నుంచి తెలంగాణకు ఈ రోడ్డు మార్గం ద్వారానే ప్రతి రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇదిలా ఉంటే ఈ రోడ్డు మార్గం ద్వారా అనుమతి లేకుండా ప్రతిరోజూ అధిక లోడుతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, రోడ్డు పక్కన పంటపోలాలు దుమ్ముతో దిగుబడి రాక నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. అక్కడక్కడ భారీగా గుంతలు ఏర్పడడంతో వాహనాలు దిగబడిపోతున్నాయని గ్రామస్తులు వాపోయారు. అదేవిధంగా ఈ రోడ్డు మార్గాన భారీ వాహనాలతో మహరాష్ట్రకు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంకట్రావ్‌పేట్ రోడ్డు మార్గాన అనుమతి లేని భారీ వాహనాలను అనుమతించొద్దని గ్రామస్తులు అధికారులను వేడుకుంటున్నారు.

చర్చలు సఫలం.. సమ్మె విరమణ

గోలేటి జీఎం కార్యాలయంలో చర్చలు జరుపుతున్న యాజమాన్యం, నాయకులు

రెబ్బెన, జనవరి 12 : సింగరేణి కాలరీస్ కోల్ ట్రాన్స్‌ఫోర్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని మూడు రోజుల నుంచి చేస్తున్న సమ్మె శుక్రవారం గోలేటి జీఎం కార్యాలయంలో జరిగిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమించడం జరిగిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన చర్చల్లో ఏరియా జీఎం రవిప్రసాద్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, క్యాలిటీ మేనేజర్ రవి, సీఐ అల్లం నరేందర్, ఎస్ఐ రమేశ్, ట్రాన్స్‌ఫోర్ట్ యాజమాన్యం ప్రవీణ్ రావు, జితేందర్, యూనియన్ నాయకులు పాల్గొని చర్చించారు. ప్రస్తుతం అందిస్తున్న వేతనానికి అదనంగా రూ.2వేలు చెల్లించడం, ప్రతినెలా 10వ తేదీన వేతనాలు చెల్లించడం, రవాణా సౌకర్యం కల్పించడం లాంటి హక్కులు సాధించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి అధ్యక్షుడు అరికిల్ల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ఉపాధ్యక్షుడు లచ్చన్న, కార్యదర్శి రవిప్రసాద్‌గౌడ్, నంది రాజ్‌కుమార్ పలువురు ఉన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

కాగజ్‌నగర్: పతావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు

కాగజ్‌నగర్, జనవరి 12: ప్రతి మనిషి జీవితంలో ఆధ్యాత్మికత చాలా అవసరమని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్‌లోని సద్గురు దేవానంద ఆశ్రమంలో 24వ ఆరాధనోత్సవాల్లో పాల్గొని పతాకావిష్కరణ చేసి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి ఆధ్యాత్మికత వైపు మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ నాయకులు, ఆధ్యాత్మిక గురువులు పాల్గొన్నారు.

హోంగార్డ్ మృతిపై సంతాపం

బాబాసాగర్‌లో హోంగార్డ్ కుటుంబానికి నగదును అందజేస్తున్న డీఎస్పీ కరుణాకర్

చింతలమానేపల్లి, జనవరి 12: కాగజ్‌నగర్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డ్ అల్లూరి పోచం కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ తన స్వగృహం బాబాసాగర్‌లో శుక్రవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ కె సురేశ్‌కుమార్ హోంగార్డ్ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఎస్పీ ఆదేశాలతో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ హోంగార్డు కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం కింద అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు, కౌటాల సీఐ సాదిక్ పాషా తన వ్యక్తిగతంగా రూ.10 వేలను అందించారు. కుటుంబసభ్యులకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని డీఎస్పీ భరోసానిచ్చారు. ఆయన వెంట కాగజ్‌నగర్ టౌన్ సీఐ బుద్దేస్వామి, కౌటాల సీఐ సాదిక్ పాషా, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ హోంగార్డులు కిరణ్‌కుమార్, చింతలమానేపల్లి ఎస్ఐ సురేశ్‌కుమార్‌లు ఉన్నారు.